యువకుడి ఆత్మహత్య

మందమర్రి, అక్టోబర్ 8: జీవితంపై విరక్తి చెంది మామిడాల తిరుపతి(32) ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మందమర్రి పట్టణంలో జరిగింది. మందమర్రి ఎస్ఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం..ఏడు సంవత్సరాల క్రితం మంచిర్యాలలో జరిగిన ప్రమాదంలో తిరుపతి కుడి కాలు పలుచోట్ల విరిగింది. నిత్యం కూలి పనులు చేస్తూ జీవనం సాగించే తిరుపతి ఏదైనా పని చేస్తే కాలు వాపు వస్తుండేది. దీంతో మద్యానికి బానిసయ్యాడు. రెండేళ్ల క్రితం అతని తండ్రి లక్ష్మీనారాయణ అనారోగ్యంతో మరణించాడు. దీంతో మానసికంగా క్రుంగి పోయిన తిరుపతి ఏ పని చేయలేక పోవడంతో వివాహం కూడా జరగడం లేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం అర్ధ రాత్రి మద్యం మత్తులో ఇంటి ముందు వరండాలో పై కప్పునకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తిరుపతి తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పిల్లలు కావడం లేదని..

చెన్నూర్ రూరల్, అక్టోబర్ 8: చెన్నూర్ మండలంలోని చింతలపల్లికి చెందిన అల్లంపల్లి పోచన్న (38) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని చెన్నూర్ ఎస్ఐ శ్వేత తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం చింతలపల్లికి చెందిన అల్లంపల్లి పోచన్నకు స్వరూపతో 13 సంవత్సరాల క్రితం వివాహమైనప్పటికీ పిల్లలు కాలేదు. దీంతో మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం మద్యం మత్తులో ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గతంలో కూడా పోచన్న రెండు సార్లు ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని చెన్నూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి భార్య స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రేమికుడి వేధింపులు తాళలేక..

బెల్లంపల్లి, అక్టోబర్ 8 :ప్రేమికుడి వేధింపులు తాళలేక యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం బెల్లంపల్లి మండలంలోని చాకెపల్లిలో జరిగింది. తాళ్ల గురిజాల ఎస్ఐ రమేశ్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం చాకెపల్లికి చెందిన జక్కం అంజలి (18), చిన్నగుడిపేటకు చెందిన యాటకర్ల రాజు ఏడేళ్లుగా నుంచి ప్రేమించుకుంటున్నారు. వివాహం చేసుకోవాలంటే రూ.5 లక్షల కట్నం ఇవ్వాలని రాజు మానసికంగా వేధిస్తున్నాడు. రెండు రోజుల క్రితం అంజలి బతుకమ్మ ఆడడానికి వెళ్లగా ఎందుకు వెళ్లావని ఇంటికి వచ్చి కొట్టాడు. ఎవరితోనైనా ఫోన్‌లో మాట్లాడినా అనుమానించేవాడు. మనస్తాపంతో అంజలి ఇంట్లో చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

పెద్ద చెరువు వద్ద పారిశుధ్య పనులు

చెన్నూర్, అక్టోబర్ 8: సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకొని చెన్నూర్‌లోని పెద్ద చెరువు బతుకమ్మ ఘాట్ వద్ద మంగళవారం మున్సిపాలిటీ వారు పారిశుధ్య పనులను నిర్వహించారు. బతుకమ్మ ఘాట్ వద్ద చెత్తను తొలగించి శుభ్రం చేశారు. అనంతరం లైట్లను ఏర్పాటు చేశారు. పట్టణంలోని మటన్ మార్కెట్ వద్ద వ్యర్థాలను తొలగించి వ్యాపారులకు సూచించారు. ఈ పారిశుధ్య పనులను మున్సిపాలిటీ కమిషనర్ గంగాధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్ పర్యవేక్షించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

2009-10 బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి పూర్వ విద్యార్థులు

దండేపల్లి, అక్టోబర్ 8: దండేపల్లి మండలంలోని వెల్గనూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో 2009-10 సంవత్సరం పదో తరగతి చదివిన వారంతా మంగళవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు బాగోగులు తెలుసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా గురువులను ఘనంగా సన్మానించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

మందమర్రి, అక్టోబర్ 8: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని ఊరు మందమర్రి గ్రామంలో దసరా పండుగను పురస్కరించుకుని మా ఊరు సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పది మంది నిరుపేద కుటుంబాల ప్రజలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎండీ ఇబ్రహీం, అధ్యక్షుడు పెద్ది రాజన్న, ఆదివాసీ నాయక్‌పోడ్ సేవా సంఘం జిల్లా నాయకుడు పాలమాకుల భీంసేన్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం బృందం పర్యటన

రక్తనమూనా సేకరిస్తున్న సిబ్బంది

దండేపల్లి, అక్టోబర్ 8: దండేపల్లి మండలంలోని రాజుగూడ జీపీ పరిధిలోని జైతుగూడలో మంగళవారం కేంద్ర బృందం పర్యటించింది. ఈ సందర్భంగా మలేరియా, డెంగ్యూ, ఫైలేరియా సంబంధించిన సర్వే నిర్వహించారు. అనంతరం పలువురికి రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు, వైద్యాధికారి క్రాంతి కిరణ్, సూపర్‌వైజర్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిలిం పోటీలకు ఆహ్వానం

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 8: శాంతిభద్రతలు, సమాజ రక్షణలో తమ ప్రాణాలను సైతం తృణపాయంగా పెట్టి, పోరాడి వీరమరణం పొందిన అమర పోలీసుల జ్ఞాపకార్థం అక్టోబర్ 21న జరిగే పోలీస్ ఫ్లాగ్ డే ను పురస్కరించుకొని పోలీస్ రిలేటెడ్ అంశాలపై ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిలిం తీసేందుకు ఆసక్తిగల యువతీ, యువకులు ముందుకు రావాలని రామగుండం కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల కోసం పోలీసుల త్యాగాలు, విధుల్లో ప్రతిభ తెలిపే విధంగా తీసిన 3 ఫోటోలు, మూడు నిమిషాలకు తగ్గకుండా షార్ట్ ఫిలింను తీసి పెన్‌డ్రైవ్‌లో లోడ్ చేసి ఈ నెల 20వ తేదీ సాయంత్రం లోగా కమిషనరేట్ కార్యాలయంలోని ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం లేదా, పోలీస్ పీఆర్వోకు అందజేయాలని తెలిపారు. కమిషనరేట్ స్థాయిలో సెలెక్ట్ అయిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు హైదరాబాద్ డీజీపీ కార్యాలయానికి పంపిస్తామని, వివరాలకు 8712656596, 8712656587 నంబర్లకు సంప్రదించాలన్నారు.

చిరు వ్యాపారులకు గొడుగుల పంపిణీ

కాసిపేట, అక్టోబర్ 8 : కాసిపేట మండలంలోని దేవాపూర్ గ్రామంలో దేవాపూర్ ఓరియంట్ గోల్డ్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా ఎల్సీఐఎఫ్ కో ఆర్డినేటర్ గొంది వెంకటరమణ చేతుల మీదుగా రోడ్డుపై కూరగాయలు, చిరు వ్యాపారులు చేసుకునే వారికి గొడుగులు పంపిణీ చేశారు. ఇటీవల కార్పెంటర్ శ్రీనివాస్ మృతి చెందగా ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించి తన వంతుగా రూ.5 వేలను ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు బొల్లు రమణారెడ్డి, తదితరులున్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థులకు వృత్తి విద్య పై ఇంటర్ షిప్

కోటపల్లి, అక్టోబర్ 8 : కోటపల్లి మోడల్ స్కూల్ ఇంటర్ విద్యార్థులకు వృత్తి విద్యలో భాగంగా ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్ వేర్ సంబంధించిన ఇంటర్ షిప్ నిర్వహించారు. విద్యార్థులకు దసరా సెలవుల్లో 10 రోజుల పాటు ఇంటర్ షిప్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కే రాజశేఖర్ తెలిపారు.

భూ కబ్జాలు, గొడవలకు పాల్పడితే రౌడీ షీట్

తనిఖీ చేపడుతున్న సీఐ, ఎస్ఐ

కాసిపేట, అక్టోబర్ 8 : భూ కబ్జాలకు పాల్పడినా, భూమి సంబంధిత గొడవల్లో చేసినా లేదా అమాయకులను మోసం చేసినా వారిపై న్యాయ పరమైన కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు రౌడీ షీట్ తెరుస్తామని మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం కాసిపేట మండలంలోని సోమగూడెం ట్యాంక్ బస్తీలో మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి, కాసిపేట, మందమర్రి, దేవాపూర్, రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధి పోలీస్ సిబ్బందితో పాటు నార్కోటిక్ డాగ్ ఫోర్స్‌తో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ (కార్డెన్ అండ్ సెర్చ్) నిర్వహించారు.ద్విచక్ర వాహనాలు, ఆటోల ఆర్‌సీ, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్‌లు తనిఖీ చేశారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని, నంబర్ ప్లేట్ లేని 36 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలను గుర్తించి వాటిని అక్కడికక్కడే సరి చేశారు. మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక ప్రజలకు సైబర్ క్రైమ్, గంజాయి నియంత్రణ, సీసీ కెమెరాల ప్రాముఖ్యత, ట్రాఫిక్ రూల్స్, కొత్త చట్టాలు, మూఢ నమ్మకాలపై అవగాహన కల్పించారు. తనిఖీల్లో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న షాపులో సోదా చేసి అక్రమంగా నిలువ ఉంచిన రూ.7606 విలువ మద్యాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో కాసిపేట ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు, రామకృష్ణాపూర్, మందమర్రి ఎస్ఐలు, ఏఎస్ఐ బూర రవీందర్, పలువురు ఏఎస్ఐలు, నార్కొటిక్ డాగ్ స్క్వాడ్ ఫోర్స్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

బెల్లంపల్లి, అక్టోబర్ 8 : బెల్లంపల్లి టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గంజాయి తాగే వారిపై పట్టుకునేందుకు ఇండ్లల్లో మంగళవారం పోలీసులు నార్కోటిక్ డాగ్ స్క్వాడ్‌తో విస్తృతంగా తనిఖీలు చేశారు. రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ మాట్లాడుతూ చిన్న వయస్సులో చెడు వ్యసనాలు, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసలై జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయి సేవించినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో టూటౌన్ ఎస్ఐ మహేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331785-All
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

పండుగల వేళ 'స్థానిక' ఆశావాహుల ఆఫర్లు

- స్థానిక ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ పండుగలకు భారీగా ఖర్చులు
- సొంతంగా సౌండ్ బాక్సులు, చీరలు, దసరాకు మద్యం, మటన్ ఆఫర్లు



కాసిపేట, అక్టోబర్ 8 : స్థానిక ఎన్నికలు దగ్గర పడుతుండడంతో సద్దులు, దసరా పండగలనే వినియోగించుకొని ప్రజలను ప్రసన్నం చేసుకోవాలని ఆశావాహులు పలు ఆఫర్లు ఇస్తూ భారీగా ఖర్చు చేసేందుకు వెనకాడడం లేదని తెలుస్తున్నది. ఇప్పటికే చాలా చోట్ల మహిళలకు సొంత ఖర్చులతో చీరలను పంపిణీ చేశారు. మరికొన్ని చోట్ల బతుకమ్మ చీరలను సద్దుల పండుగకు ముందు రోజు పంపిణీ చేయాలని ఏర్పాట్లు చేస్తున్నారు. చాలా గ్రామాల్లోని కాలనీల్లో మహిళల బతుకమ్మ ఆటలకు, దుర్గా మండపాలకు సౌండ్ బాక్సులు కొనివ్వడం, కిరాయిలు వారే చెల్లించడం చేస్తున్నారు. దసరాకు మగవారిని ప్రసన్నం చేసుకునేందుకు కాలనీల వారీగా మేకలను కొనిచ్చి వారే ప్రతి ఇంటికీ పోగులు వేయడం, మద్యం పంపిణీకి ప్లాన్ చేస్తున్నారు. సాధారణ రోజుల్లో ఖర్చు చేస్తే పట్టించుకోరని, పండుగల వేళ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తే ఓటర్లకు గుర్తుండి పోతుందనే అభిప్రాయంతో సన్నాహాలు చేస్తున్నారని గ్రామాల్లో చర్చించుకుంటున్నారు. కొన్ని చోట్ల రాజకీయ నాయకులు ముందుకు రాకున్నా ఆయా కాలనీల పెద్దలు కాలనీ ప్రజల తరఫున వెళ్లి ఆశావాహులను నేరుగానే సంప్రదించి వారికి కావాల్సిన వాటిని ఇవ్వాలని కోరుతున్నట్లు సమాచారం. పలువురు రాజకీయ నేతలు పండుగలకు భారీగా ఖర్చులు చేసేందుకు ముందుకు వస్తుండడంతో గ్రామాల్లో దసరా, సద్దుల సందడి నెలకొన్నది. ఇన్ని ఖర్చులు చేసే రాజకీయ నేతలకు మరి స్థానిక ఎన్నికల్లో ప్రజలు మద్దతుగా ఉంటారో లేదో ఇక వేచి చూడాల్సిందే.

మంచిర్యాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యుత్ శాఖ ఉద్యోగినులు

ఆసిఫాబాద్‌లో బతుకమ్మ ఆడుతున్న యువతులు, మహిళలు

ఘనంగా బతుకమ్మ సంబురాలు

క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 8: మంచిర్యాల జిల్లా విద్యుత్ శాఖ మహిళా ఉద్యోగినుల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని విద్యుత్ కార్యాలయంలో బతుకమ్మ సంబురాలను నిర్వహించారు. ఉద్యోగినులు బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్యాతనపల్లి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో..

మందమర్రి, అక్టోబర్ 8: క్యాతనపల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ వేడుకలను ప్రారంభించగా చైర్‌పర్సన్ జంగం కళతో పాటు మహిళా కౌన్సిలర్లు, మెప్మా ఆర్పీలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆడిపాడారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పోగుల మల్లయ్య, జిలకర మహేశ్, రేవెల్లి ఓదెలు, సూపర్‌వైజర్ వేల్పుల శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, అక్టోబర్ 8: మండలంలోని రాజుర గ్రామంలో సద్దుల బతుకమ్మ వేడుకలు వైభవంగా జరిగాయి. యువతులు, మహిళలు పెద్ద సంఖ్యలో ఆడిపాడారు. అనంతరం పెద్దవాగులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

ఆసిఫాబాద్ టౌన్, అక్టోబర్ 8: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. డీజే పాటలకు మహిళా ఉద్యోగులు పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. డిపో మేనేజర్ విశ్వనాథ్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, సరియ ఎస్టీఐ, ఎంఎఫ్ ఉదయ్, టీఐ భారతి, హెడ్ కానిస్టేబుల్ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపో ఆవరణలో బతుకమ్మ ఆడుతున్న ఉద్యోగినులు

రైలు ఢీ కొని ఒకరి మృతి

మందమర్రి, అక్టోబర్ 8: ప్రమాదవశాత్తు రైలు ఢీ కొని కంబాల శంకర్(49) మృతి చెందిన ఘటన మందమర్రి పట్టణంలో మంగళవారం జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మందమర్రిలోని గాంధీనగర్‌కు చెందిన కంబాల శంకర్ మంగళవారం ఉదయం బహిర్భూమికి వెళ్లి వస్తానని భార్యతో చెప్పి బయటకు వెళ్లాడు. రామన్‌కాలనీ సమీపంలో జాతీయ రైల్వే ట్రాక్ దాడుతుండగా బెల్లంపల్లి నుంచి మందమర్రి వైపు వచ్చే రైలు ఢీ కొనడంతో మృతి చెందాడు. శంకర్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. భార్య భాను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్ తెలిపారు.

'డ్రంక్ అండ్ డ్రైవ్'లో జైలు శిక్ష

బెల్లంపల్లి, అక్టోబర్ 8 : డ్రంక్ డ్రైవ్‌లో పట్టుబడ్డ మండలంలోని బూధకలాన్ గ్రామానికి చెందిన జంగపల్లి సాయిహర్షిత్, కోట శేషుకు బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ముఖేశ్ మూడు రోజుల శిక్ష విధించినట్లు తాళ్ల గురిజాల ఎస్ఐ రమేశ్ తెలిపారు. అంతకు ముందు పోలీస్‌స్టేషన్‌లో వీరికి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కలిగే అనర్థాలను వివరించారు. జరిమానాలు, జైలు శిక్ష, లైసెన్స్‌లు కూడా రద్దుచేస్తామన్నారు.

బోగస్ స్వచ్ఛంద సంస్థలపై చర్యలు తీసుకోవాలి

బెల్లంపల్లి, అక్టోబర్ 8 : ఉద్యోగాలు పెట్టిస్తామని నమ్మబలికి నకిలీ నియామక పత్రాలు అందించి అమాయక ప్రజలను మోసం చేస్తున్న బోగస్ స్వచ్ఛంద సేవా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎంసీపీఐయూ నాయకులు రాజేంద్రప్రసాద్, వెంకటేశ్ డిమాండ్ చేశారు. స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అటెండర్లు, ఇతర ఏఎన్ఎం ఉద్యోగాలు పెట్టిస్తామని లక్షలాది రూపాయలు వసూలు చేశారని విమర్శించారు. డబ్బులు వసూలు చేస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

వన్య ప్రాణుల సంరక్షణపై అవగాహన

చెన్నూర్ రూరల్, అక్టోబర్ 8: చెన్నూర్ మండలంలోని అక్కెపల్లిలో మంగళవారం డిప్యూటీ రేంజ్ అధికారి ప్రభాకర్ ఆధ్వర్యంలో 70వ వన్యప్రాణి వారోత్సవాలను నిర్వహించారు. వన్యప్రాణులను వేటాడినా, చంపినా వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 ప్రకారం శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెదింటి రాజన్న, మాజీ ఎంపీటీసీ పోచం, ఈజీఎస్ ఎఫ్ఏ ఎర్రయ్య అటవీ శాఖ అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

అటవీ జంతువులపై అవగాహన ఉండాలి

భీమారం, అక్టోబర్ 8 : అటవీ జంతువులపై ప్రతి ఒక్కరికీ అవగహన కలిగి ఉండాలని, అటవీ ప్రాణులను వేటాడడం నేరమని సెక్షన్ అధికారిని విజయలక్ష్మి సూచించారు. భీమారం మండలంలోని బూర్గుపల్లి, నర్సింగాపూర్‌లో 70 వన్య ప్రాణుల వారోత్సవాల్లో భాగంగా అక్కడ గ్రామస్తులకు కల్పించారు. ఈ కార్యక్రమంలో బీట్ అధికారిని సంధ్య పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణకు పాటుపడాలి

బెల్లంపల్లి, అక్టోబర్ 8 : వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణం పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాని నార్వాయిపేట సెక్షన్ అధికారి శ్రీనివాస్ కోరారు. వన్య ప్రాణుల వారోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని పెర్కపల్లిలో అవగాహన సదస్సు నిర్వహించారు. వన్యప్రాణులు ఎదుర్కొంటున్న ఒత్తిడి, సవాళ్లపై అవగాహన పెంపొందించారు. వన్యప్రాణుల వేటను అరికట్టడంలో యువత అటవీ శాఖకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో అటవీ శాఖ అధికారులు కే.గౌరీ శంకర్, పంచాయతీ సెక్రటరీ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

- డీపీవో వెంకటేశ్వర్లు

దండేపల్లి, అక్టోబర్ 8: ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. దండేపల్లి మండలంలోని గూడెం జీపీని ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణ నిర్వాహకులకు ప్లాస్టిక్ నివారణ అవగాహన కల్పించారు. ఆరుబయట చెత్త వేసి పరిసరాలను కలుషితం చేసే దుకాణ నిర్వాహణదారులకు హెచ్చరిక నోటీసులు అందించాలని, అయినా వినకపోతే జరిమానా విధిస్తూ ఆయా దుకాణాల ట్రేడ్ లైసెన్స్‌లు రద్దు చేయాలని ఆదేశించారు. డంప్ యార్డును పరిశీలించారు. అనంతరం జీపీని సందర్శించి, రికార్డులు తనిఖీ చేశారు.ఈ ఎంపీడీవో ప్రసాద్, ఎంపీవో, జీపీ కార్యదర్శి ఉన్నారు.

హర్యానాలో విజయంపై బీజేపీ సంబురాలు

మంచిర్యాల (ఏసీసీ), అక్టోబర్ 8: హర్యాన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంతో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబురాల నిర్వహించారు. స్వీట్లు తినిపించుకుంటూ నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో పురుషోత్తం జాజు, ఎనగందుల కృష్ణమూర్తి, పేరం రాజయ్య, రాకేశ్ రేణ్వా తదితరులు పాల్గొన్నారు.

న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలి

మంచిర్యాల (ఏసీసీ), అక్టోబర్ 8: బీసీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, లేనిచో రాష్ట్రవ్యాప్త నిరసన కార్యక్రమాలకు దిగుతామని హెచ్చరిస్తూ జిల్లా కేంద్రంలో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు.. రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ కు మంగళవారం బహిరంగ లేఖ విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో కర్రె లక్ష్మణ్, గుమ్ముల శ్రీనివాస్, అక్కల రమేశ్, శాకపురి భీమ్సేన్, చంద్రగిరి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాతకు వైభవంగా కుంకుమ పూజ



చెన్నూర్‌లో బలిజవాడలోని కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



రెబ్బెనలో ఇందిరానగర్ మహంకాళి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నమస్తే నెట్‌వర్క్, అక్టోబర్ 8 : చెన్నూర్‌లోని బలిజవాడ శ్రీమంజునాథ దుర్గామాత మండపంలో మంగళవారం కుంకుమార్చన నిర్వహించారు. రెబ్బెన మండలం ఇందిరానగర్ గ్రామంలో కొలువైన కనకదుర్గాదేవి స్వయంభూ మహంకాళి దేవస్థానంలో అమ్మవారు మహలక్ష్మిదేవి రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఏసీసీ ఏరియాలో సనాతన దేవి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మండపాన్ని .1.25 లక్షల విలువైన నోట్లతో అలంకరించారు. తాండూర్‌లోని బోయపల్లి, దహెగాంలో రాస్పల్లిలో, మందమర్రి మండలంలో మందమర్రిలో పట్టణంతో ఆదిలపేట్‌లో ప్రత్యేక పూజలు చేశారు.

ధరణి దరఖాస్తులను పరిష్కరించాలి

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ టౌన్,అక్టోబర్ 8 :ధరణిలో వివిధ భూ సమస్యలపై అందిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణుతో కలిసి తహసీల్దార్లతో ధరణి పెండింగ్ దరఖాస్తులు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, మీ -సేవ దరఖాస్తులు, ప్రజావాణి దరఖాస్తులు, ఎల్ఆర్ఎస్. సర్వే, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, కరీంనగర్ పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఓటరు జాబితా నమోదు తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ దరఖాస్తులను పరిశీలించి సంబంధిత శాసనసభ్యుల సంతకాలు తీసుకొని వెంటనే లాగిన్ లో నమోదు చేయాలని తెలిపారు. కులం, ఆదాయం, నివాసం తదితర ధ్రువపత్రాల కోసం దరఖాస్తులను పరిశీలించి నిర్ణీత గడువులోగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజావాణిలో వచ్చిన భూ సమస్యలపై పూర్తి వివరాలతో నివేదిక అందించాలని తెలిపారు. అనుమతి లేని లే-అవుట్ల క్రమబద్ధీకరణ కోసం ఎల్ఆర్ఎస్ -2020 ద్వారా అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లపై చర్యలు తీసుకోవాలని కరీంనగర్ పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాలకు అర్హులైన వారు ఓటరు జాబితాలో నమోదు చేయడంపై సూచనలు చేశారు.

దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

సూచనలిస్తున్న అదనపు కలెక్టర్

ఆసిఫాబాద్ టౌన్,అక్టోబర్ 8: ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను రికార్డులు సరి చూసి క్షేత్రస్థాయిలో పరిశీలించాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. మంగళవారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం మోతుగూడలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల సంబంధిత ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ -2020 పథకంలో అనుమతి లేని లే-అవుట్ల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తులను రికార్డులు సరి చూసి క్షేత్రస్థాయిలో సదరు ప్లాట్ల భౌగోళిక స్థితిని పరిశీలించి త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిషేధిత, ప్రభుత్వ భూములు, చెరువు శిఖం, వాగుల సంబంధిత భూముల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని, దరఖాస్తుదారుడికి సమాచారం అందించి దరఖాస్తు సంబంధిత డాక్యుమెంట్లను పరిశీలించాలని తెలిపారు. భూముల సర్వే నంబర్ ప్రకారం రికార్డులు, మ్యాప్‌లు సరి చూసుకొని తదుపరి చర్యలు తీసుకోవాలని తెలిపారు. దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ వేగవంతం చేసి త్వరగా పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీవో భిక్షపతి గౌడ్, ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మండలంలో వర్షం

కెరమెరి, అక్టోబర్ 8: మండలంలో మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. మంగళవారం మధ్యాహ్నం వరకు ఎండతో జన ఉక్కిరి బిక్కిరి అయ్యారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సుమారు గంట పాటు పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. రోడ్లపై వరద ప్రవహించింది. అప్పటి వరకు ఉక్కపోతతో ఇబ్బందులకు గురైన ప్రజలకు వర్షంతో ఉపశమనం పొందారు.

పరిసరాల శుభ్రతపై అవగాహన

వాంకిడి, అక్టోబర్ 8 : మండలంలోని కొత్త దుబ్బ గూడ గ్రామంలో మంగళవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పరిసరాల్లో దోమలు లార్వా ఉన్న నీటిని గుర్తించి, పార బోయించి శుభ్రం చేయించి పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అవసరం ఉన్న వారికి ఉచిత మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ విస్తరణ అధికారి రవిదాస్,హెల్త్ అసిస్టెంట్లు భగవాన్ దాస్, సునీత, ఎంఎల్‌హెచ్‌పీ తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ఆసిఫాబాద్ టౌన్, అక్టోబర్ 8: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి యశస్వి పథకం కింద ఉపకార వేతనాల కోసం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సజీవన్ ఒక ప్రకటనలో తెలిపారు. 9, 10 తరగతుల విద్యార్థులకు 75 వేల రూపాయలు, ఇంటర్ విద్యార్థులకు లక్షా ఇరవై ఐదు వేల రూపాయల చొప్పున ఉపకార వేతనం అందిస్తామని తెలిపారు. 9 / 11 వ తరగతిలో ఉన్నత తరగతి పాఠశాలలో చదువుతున్న వారు కూడా అర్హులని తెలిపారు. అభ్యర్థులకు గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ వార్షిక ఆదాయం లక్షాయాభై వేల రూపాయలు, పట్టణ ప్రాంతాల వారికి 2 లక్షల రూపాయలకు మించి ఉండరాదని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించే యశస్వి ప్రవేశ పరీక్ష-2023లో మెరిట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ ఉంటుందని, బీసీ, ఈబీసీ, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు ఈ నెల 31 వ తేదీలోగా ఆన్‌లైన్‌లో HTTPS://YET.NTA.AC.IN, HTTP://SOCIALJUSTICE.GOV.IN/SCHEMES/ లో, మీ -సేవ కేంద్రాల్లో సంప్రదించాలని తెలిపారు.

సబ్ కలెక్టర్‌ను కలిసిన ఆసిఫాబాద్ డీఎం

కాగజ్‌నగర్ రూరల్, అక్టోబర్ 8: ఆసిఫాబాద్ డిపో మేనేజర్ విశ్వనాథ్ మంగళవారం కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాను మర్యాద పూర్వకంగా కలిసి బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఆర్టీసీ సంస్థ, ట్రాన్స్‌పోర్ట్ మినిస్టర్ పొన్నం ప్రభాకర్ నుంచి వచ్చిన గిఫ్టును అందజేశారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు అన్ని వసతులు కల్పిస్తున్నామని డిపో మేనేజర్ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

కాగజ్‌నగర్ రూరల్, అక్టోబర్ 8 : కాగజ్‌నగర్ పట్టణంలోని వినయ్ గార్డెన్ సమీపంలో వాహనాల్లో అక్రమంగా పశువులను తరలిస్తుండగా కాగజ్‌నగర్ గ్రామీణ పోలీసులు నిఘా వేసి పట్టుకున్నారు. ఈ ఘటనలో 10 మందిపై కేసు నమోదు చేసి వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు కాగజ్‌నగర్ గ్రామీణ ఎస్ఐ మహేందర్ తెలిపారు. పట్టుకున్న పశువులను స్థానిక గోశాలకు తరలించినట్లు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

వాంకిడి, అక్టోబర్ 8: మండలంలోని బనార్ కోసార గ్రామ శివారులో పేకాడుతున్నారనే సమాచారం మేరకు వాంకిడి ఎస్ఐ ప్రశాంత్ పోలీస్ సిబ్బందితో కలిసి మంగళవారం తెల్లవారు జామున 4 గంటలకు దాడులు చేశారు. పేకాడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2200ను స్వాధీనం చేసుకున్నారు. పేకాడుతున్నట్లు తెలిస్తే డయల్ 100 లేదా 8712670531కి సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.